

కడెం ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ జానకీ షర్మిల

## కడెం ప్రాజెక్టును సందర్శించిన ఎస్పీ

కడెం, జనవరి 14 : నిర్మల్ జిల్లా కడెం మండల కేంద్రంలోని కడెం ప్రాజెక్టును ఆదివారం ఎస్పీ జానకీ షర్మిల సందర్శించారు. అనంతరం బోటింగ్ చేశారు. ఆమె వెంట సీఐ మోహన్, ఎస్ఐ రంజిత్, సిబ్బంది ఉన్నారు.


నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్

5 | నిజామాబాద్, సోమవారం 15 జనవరి 2024 | ADILABAD




# ఇథనాల్ ఇక్కడెందుకు..?

### గుండంపెల్లి వద్ద ఏర్పాటుపై అభ్యంతరాలు

- రైతుల అభిప్రాయానికి వ్యతిరేకంగా పనులు
- పార్టీలకతీతంగా కొనసాగుతున్న ఆందోళనలు
- నిరసనలపై ఇప్పటివరకు స్పందించని సర్కారు
- అధికారుల తీరుపైనా విమర్శలు

నిర్మల్, జనవరి 14 (నమస్తే తెలంగాణ): నిర్మల్ జిల్లాలోని దిలావర్‌పూర్-గుండంపెల్లి గ్రామాల మధ్య నిర్మించతలపెట్టిన ఇథనాల్ ఫ్యాక్టరీని రైతాంగం వ్యతిరేకిస్తున్నది. అయినా యాజమాన్యం, సంబంధిత అధికారులు మొండి వైఖరిని అవలంబిస్తుండడం విమర్శలకు తావిస్తున్నది. మొదట్లో యాజమాన్యం సహేతుకమైన కారణాలు చూపకుండానే ఫ్యాక్టరీ ఏర్పాటుకు అన్ని అనుమతులు సాధించింది. అయితే స్థానిక రైతుల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోకపోవడం ప్రస్తుతం వివాదానికి కారణమవుతున్నది. యాజమాన్యం మాత్రం ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో అందరికీ మేలు జరుగుతుందంటూ రైతులను ముందుగా ఒప్పించింది. దిలావర్‌పూర్, గుండపెల్లితో పాటు సముందర్‌పెల్లి, లోలం తదితర గ్రామాల భూములు సారవంతంగా ఉండడం, సాగునీరు పుష్కలంగా అందుబాటులో ఉన్న కారణంగా పంట దిగుబడులు అధికంగా వస్తుంటాయి. సంబంధిత యాజమాన్యం మాత్రం ఇక్కడి భూములను చౌకగా కొనుగోలు చేసింది. రైతులు, ప్రజా సంఘాలు, వీడీసీల అభిప్రాయాలను లెక్కలోకి తీసుకోకుండా ఫ్యాక్టరీ పనులను కొనసాగిస్తున్నది. దీంతో రైతులు ఆందోళనలు చేస్తున్నారు. ఫ్యాక్టరీని ఇక్కడి నుంచి తరలించాలని కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి స్పందనా కనిపించలేదు.

### యాజమాన్యం తీరుపై విమర్శలు

హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ గుండంపెల్లి వద్ద దాదాపు రూ వంద కోట్ల వ్యయంతో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి రంగం సిద్ధం చేసుకుంది. అయితే ఈ ఫ్యాక్టరీ కారణంగా తమ ఆరోగ్యంపై ప్రభావం చూపడమే కాకుండా, పంట పొలాలు సైతం కాలుష్య కోరల్లో చిక్కుకుంటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాలుష్యంపై యాజమాన్యం చెప్పే మాటలు నమ్మశక్యంగా లేవంటున్నారు. నెల రోజుల నుంచి తాము ఆందోళనలు చేస్తున్నా, ఇటు ప్రభుత్వం గాని, ఇటు అధికారులు గాని పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పనులు నిలిపివేయాలని, లేకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.



ఫ్యాక్టరీ వద్ద పోలీసులతో వాగ్వాదానికి దిగుతున్న రైతులు, ప్రజలు (ఫైల్)



పనులు అడ్డుకుంటున్న వారిని చెదరగొడుతున్న పోలీసులు (ఫైల్)


### కాలుష్యం ఉండదంటున్న యాజమాన్యం

ఫ్యాక్టరీతో ఎలాంటి కాలుష్యం ఉండదని పీఎంకే ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ స్పష్టం చేస్తున్నది. కేవలం మక్క, వరి ధాన్యాన్ని వినియోగించి ఇథనాల్ తయారు చేయనున్న కారణంగా ఎలాంటి కాలుష్య సమస్య ఉండదని, దుర్వాసన వెలువడదని యాజమాన్యం చెబుతున్నది. వాతావరణంలో సైతం ఎలాంటి మార్పులు ఏర్పడబోవని స్పష్టం చేస్తున్నది. ఈ ప్రాంతంలో సాగయ్యే మక్క, వరి పంటలను ప్రభుత్వ మద్దతు ధరకే తాము కొనుగోలు చేస్తామని, నాణ్యతను సైతం పెద్దగా పరిగణలోకి తీసుకోబోమని యాజమాన్యం వివరిస్తున్నది. కాగా పరిశ్రమ నిర్వహణలో వెలువడే వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా మార్చేందుకు ఇక్కడి ఫ్యాక్టరీలోనే ప్రత్యేక యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని చెబుతున్నారు. రివర్స్ ట్యాంక్ పద్ధతిలో ఈ సేంద్రియ ఎరువును తయారు చేస్తామంటున్నారు. అంతేకాకుండా మక్క వ్యర్థాలను పశువులకు దాణాగా తయారు చేస్తామని, వరి వ్యర్థాలను నూకలుగా మారుస్తామని ఆ సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. కేవలం చెరుకుతో తయారు చేస్తేనే కాలుష్యం ఏర్పడుతుందని పేర్కొంటున్నది.

### ప్రభుత్వం స్పందించేనా...

ఫ్యాక్టరీ పనులను ప్రారంభించడంతో రైతుల ఆగ్రహం రెట్టింపైంది. ఇటీవల ఫ్యాక్టరీని ముట్టడించి నిర్మాణంలో ఉన్న ప్రహరీని, ఆస్తులను ధ్వంసం చేశారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీస్ అధికారులతో పాటు, అడిషనల్ కలెక్టర్ సంఘటనా స్థలానికి చేరుకొని రైతులను శాంతింపజేశారు. సమస్య తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అయినా రైతులు తమ నిరసనను కొనసాగిస్తున్నారు. నిర్మల్-భైంసా ప్రధాన రహదారిపై వంటా వార్పు కార్యక్రమం నిర్వహించి తమ నిరసనను తెలియజేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఫ్యాక్టరీపై సరైన నిర్ణయం తీసుకుంటుందో లేదో వేచి చూడాలి.

## సంబురాల సంక్రాంతి నేడే..



సంబురాల సంక్రాంతి రానే వచ్చింది. పట్టణవాసులు సొంతూళ్లకు చేరుకోగా, ప్రతి ఇల్లూ కళకళలాడుతున్నది. ముగ్గులతో ముస్తాబైన వాకిళ్లు కనువిందు చేస్తుండగా, గంగిరెద్దుల విన్యాసాలు.. పిల్లల ఆటాపాటలతో ఎటు చూసినా సందడే కనిపిస్తున్నది. ఆదివారం భోగిని వైభవంగా నిర్వహించిన ప్రజానీకం, నేడు మకర సంక్రాంతి, రేపు కనుమను ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమైంది.



# నాగోబా ప్రచారం ప్రారంభం



కటోడ కోసు, పర్ధాంజీ దాదారావ్‌ను ఎడ్లబండిపై ప్రచారానికి సాగనంపుతున్న మెస్రం వంశీయులు



కేస్లాపూర్‌లోని మురాడిలో ప్రచార ఎడ్లబండి మార్గాలపై చర్చిస్తూ..

ఇంద్రవెల్లి, జనవరి 14 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్‌లో ఫిబ్రవరి 9వ తేదీన నిర్వహించే నాగోబా జాతర ప్రచార రథం ప్రారంభమైంది. శనివారమే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి మెస్రం వంశీయులు కేస్లాపూర్‌కు చేరుకున్నారు. ఆదివారం ఉదయం మొదటగా పురాతన నాగోబా ఆలయం(మురాడి)లో మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌పటేల్ ఆధ్వర్యంలో ఎడ్లబండి మార్గంపై చర్చించారు. అనంతరం సంప్రదాయ పూజలు నిర్వహించి ప్రచార ఎడ్లబండి(ప్రచార రథం చక్డా)న్ని గ్రామ పోలి మేర వరకు సాగనంపారు. పొలిమేరలో కటోడా కోసు, పర్ధాంజీ దాదారావ్ సంప్రదాయరీతిలో నెలపై తంబాకు, బీడీలు వేసి అక్కడి నుంచి నాగోబాను మొక్కుకున్నారు. అనంతరం ప్రచార ఎడ్లబండిపై బయలుదేరారు. ఈ కార్యక్రమంలో మెస్రం వంశీయులు చిన్ను పటేల్, బాజీరావ్ పటేల్, కోసేరావ్ కటోడ, కోసు కటోడ, పర్ధాంజీ దాదారావ్, పేన్ కోత్వాల్ తిరుపతి, మెస్రం వంశీయుల ఉద్యోగ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సోనేరావ్, దేవ్‌రావ్, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ తుకారాం, మెస్రం వంశీయుల ఉద్యోగ సంఘం కమిటీ సభ్యులు శేఖర్‌బాబు, మానిక్‌రావ్, లింబారావ్, గణపతి, నాగ్‌నాథ్, ఆనంద్‌రావ్, జంగుబాపు, మెస్రం షేకు, సీతారామ్, ధర్ము, మారుతి, కార్తీక్ పాల్గొన్నారు.

### త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి రాక

#### మెస్రం వంశీయుల సమావేశంలో ఎమ్మెల్యే బొజ్జు

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ గ్రామానికి త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్నట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. ఆదివారం మురాడిలో నాగోబాను దర్శించుకుని మెస్రం వంశీయులు నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయ పనులు ఈనెల 20వ తేదీలోపు పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల చివరి వారంలో కేస్లాపూర్ గ్రామానికి వస్తారని, అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాటు చేసే స్మృతివనానికి భూమి పూజ, నాగోబా మురాడి ఆలయాన్ని ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

### ప్రచార ఎండ్లబండి పయనం ఇలా..

**14వ తేదీ మధ్యాహ్నం..** సిరికొండ మండలానికి చేరుకొని, నాగోబా మహాపూజకు ఉపయోగించే మట్టికుండల తయారీ కోసం కుమ్మరికి ఆదేశాలు ఇచ్చారు. సాయంత్రం రాజంపేట్‌కు చేరుకొని రాత్రి అక్కడే బస చేస్తారు.

15న గుడిహత్నూర్ మండలంలోని సోయంగూడ.

16న ఇంద్రవెల్లి మండలంలోని గిన్నేరా.

17న ఉట్నూర్ మండలంలోని సాలేవాడ.

18న ఇంద్రవెల్లి మండలంలోని పొల్లుగూడ.

19న ఇంద్రవెల్లి మండలంలోని వడగాంకు చేరుకుంటారు.

20న సాయంత్రం కేస్లాపూర్ గ్రామానికి చేరుకొని మడావి ఇంటి వద్ద బస చేస్తారు.

21న మురాడిలో పూజలు చేసి పవిత్రమైన గంగాజల సేకరణకు పాదయాత్రగా బయలుదేరుతారు.




నాగోబా మురాడిలో పూజలు చేస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

# జీఎస్టీ ఎగవేతకు యత్నం

### దుకాణాదారులు చెల్లించడంతో తీవ్ర జాప్యం

- తొమ్మిది మంది నుంచి రూ.43 లక్షలు పెండింగ్
- అధికారులు కుమ్మక్కయ్యారనే ఆరోపణలు
- నోటీసులు ఇచ్చాం: ఈవో విజయరామరావు
- ఆలయ సూపరింటెండెంట్‌కు మెమో జారీ

బాసర, జనవరి 14 : బాసర సరస్వతీ ఆలయంలో గత డిసెంబర్ 13వ తేదీన ఆలయ పరిధిలో పలు దుకాణాలకు టెండర్లను నిర్వహించారు. దుకాణాలను దక్కించుకున్న యజమానులు దేవాదాయ శాఖ నిబంధనల ప్రకారం.. వేలం పాటతోపాటు 18 శాతం జీఎస్‌టీ, 2 శాతం అగ్రిమెంట్ చార్జీలు చెల్లించాలి. కొందరు మాత్రమే చెల్లించగా.. ఇంకా తొమ్మిది మంది నుంచి రూ.43 లక్షల వరకు వసూలు కావాలి. నెల రోజులు గడుస్తున్నా.. వసూలు కాకపోవడంతో అధికారులు, దుకాణాదారులు కలిసిపోయారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై ఆలయ ఈవో విజయరామరావును వివరణ కోరగా.. వేలం పాటలో దుకాణాలను దక్కించుకున్న కొందరు యజమానులు జీఎస్టీ చెల్లించలేదనేది వాస్తవం. దీనికి దుకాణాదారులకు నోటీసులు జారీ చేశాం. జీఎస్టీ వసూలు చేస్తామని, ఒక వేళ కట్టకుంటే దేవాదాయ శాఖ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా.. ఆలయ సూపరింటెండెంట్‌కు కూడా ఈ విషయంపై మెమో జారీ తెలిపారు.



# కందుల కొనుగోళ్లకు రెడీ

- 19వ తేదీ నుంచి ప్రారంభం
- వాణిజ్య కొనుగోళ్లకు ఏర్పాట్లు
- మార్క్‌ఫెడ్ ద్వారా సేకరణ

ఆదిలాబాద్, జనవరి 14(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా గత వానకాలంలో 60,818 ఎకరాల్లో కంది సాగైంది. వర్షాలు, వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఎకరాకు ఆరు క్వింటాళ్ల చొప్పున 3.64 లక్షల క్వింటాళ్ల దిగుబడులు వచ్చే అవకాశాలు ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. కాగా.. ఈ నెల 15వ తేదీన అదనపు కలెక్టర్‌తో మార్కెటింగ్, వ్యవసాయ, మార్క్‌ఫెడ్, ఇతర శాఖల అధికారులతో సమావేశం జరుగనుంది. ఇందులో కందుల కొనుగోళ్ల విషయంలో తీసుకోవాల్సిన విషయాలపై చర్చిస్తారు. ఈ నెల 19వ తేదీ నుంచి కొనుగోళ్లు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. మార్కెట్ యార్డుల్లో మార్క్‌ఫెడ్ ద్వారా పంట ఉత్పత్తుల సేకరణ జరుగనుంది. మద్దతు ధర క్వింటాలుకు రూ.7 వేలు ఉండగా, ప్రైవేటు వ్యాపారులు రూ.8,500 చెల్లిస్తున్నారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో వాణిజ్య కొనుగోళ్లు జరుగనున్నాయి. ప్రైవేటు వ్యాపారులకు ధీటుగా వాణిజ్య కొనుగోళ్లు ఉండనుండడంతో మద్దతు ధర కంటే అధిక రేటు వచ్చే అవకాశాలు ఉన్నాయి. కాగా.. రైతులు పంట ఉత్పత్తులను తేమ, వ్యర్థాలు లేకుండా మార్కెట్‌కు తీసుకొచ్చి మంచి ధర పొందాలని ఆదిలాబాద్ జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.



ఇంద్రవెల్లి మండలంలోని ఏమాయికుంటలో కోసిన కంది పంట

# వైభవంగా అడాణేశ్వరుని శోభాయాత్ర

ఎదులాపురం, జనవరి 14 : శ్రీ సద్గురు అడాణేశ్వరుని ఏడో మహా సమాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని పల్లకీ సేవ, శోభాయాత్ర వైభవంగా కొనసాగింది. ఆదిలాబాద్ పట్టణంలోని తాంసి బస్టాండ్, అంబేద్కర్ చౌక్, వినాయక్ చౌక్, కలెక్టర్ చౌక్ మీదుగా టీచర్‌కాలనీ సమీపంలోని అడాణేశ్వర్ ఆలయం వరకు చేరుకుంది. అడాణేశ్వరుని నామస్మరణ, భజనలు, కీర్తనలను ఆలపిస్తూ భక్తులు శోభాయాత్రలో పాల్గొన్నారు. కాగా, సుశ్రీ నీలిమా అడాణేశ్వర సేవాశ్రమము ఆధ్వర్యంలో గ్రంథ సప్తాహం ఆదివారంతో ముగిసింది.

శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

